విశాలాంధ్ర కృష్ణా జిల్లా

పౌర హక్కులు కాలరాస్తున్న వైసీపీ

సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి అంబోజి

విశాలాంధ్ర, జగ్గయ్యపేట: వైసీపీ ప్రభుత్వం పౌర హక్కులను కాలరాస్తుందని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి అంబోజి శివాజీ అన్నారు. పట్టణంలో ఆర్టీసీ డిపో సమీపంలోని సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు గురువారం జీఓ నెంబర్ 1 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో సభలు, సమావేశాలు నిర్వహించుకొని భావ ప్రకటన చేసుకొనే హక్కు ఉందని,ఏదో సాకు చూపిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి పౌరుని హక్కుగా ఉన్న భావ ప్రకటన స్వేచ్ఛ, సభలు, సమావేశాల స్వేచ్ఛను హరించేలా జీఓ నెంబర్ 1 ప్రభుత్వం తీసుకురావడం దారుణమని ప్రభుత్వ తీరుని ఎండగట్టారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 1 ని రద్దు చేసి పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు పోతుపాక వెంకటే శ్వర్లు, బోగ్యం నాగులు, మెటికల శ్రీనివాస రావు, సాకి వెంకటేశ్వర్లు, ఏఐవైయఫ్ నాయకు లు యంద్రపల్లి భాను,కర్ల జోజి పాల్గొన్నారు.

'సైకో పోవాలి... సైకిల్ రావాలి'

విశాలాంధ్ర - గుడివాడ: సైకో పోవాలి, సైకిల్ రావాలనే వినూత్న కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. రాష్ట్రంలో జగన్, గుడివాడలో కొడాలి నాని స్వార్ధ రాజకీయ పాలన పోయి, ప్రజలు సుభిక్షంగా ఉండే టీడీపీ పాలన రావాలని విజయదుర్గ అమ్మవారికి నేతలతో కలిసి రావి పూజాలు నిర్వహించారు. రావి మాట్లాడుతూ, 20 ఏళ్లగా గుడివాడకు పట్టిన కొడాలిశనిని అంత మొందించే రోజులు దగ్గరపడ్డాయన్నారు. సైకో పాలన నుండి ప్రజలకు విముక్తి కల్పించడమే లక్ష్యంగా చంద్రబాబు నాయకత్వంలో పోరాడుతామన్నారు. యార్లగడ్డ సుధారాణి, పోలాసి ఉమా, గొర్జి సత్యనారాయణ, గోకవరపు సునీల్, షేక్ జానీషరీఫ్, వేణుబాబు, ముళ్ళపూడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్, షటిల్ విజేతకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర - గుడివాడ : క్రీడా పోటీల్లో బహుమతులు అందుకోవడం అభినందనీయమని ఎంపీపీ గద్దే పుష్పరాణి, ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. రూరల్ మండలం పరిధిలోని సచివాలయ సిబ్బంది సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకొని యువజన ఉత్సవాలలో భాగంగా జరిగిన క్రీడా పోటీలలో రమనపూడి సచివాలయ సెక్రటరీ గుంజా చందు క్రికెట్, షటిల్‌లో విజేతగా నిలిచారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో విజేతగా నిలిచిన చంద్‌కు బహుమతులు అందజేశారు. జడ్‌పిటిసి గొళ్ళ రామకృష్ణ, డి.వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర, మచిలీపట్నం: స్థానిక 3 వ డివిజన్ పరిధిలోని గంగుల తోట లో సుమారు రూ.36 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్‌కు మందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం 48 వ డివిజన్ పరిధిలోని బలరాముని పేట ప్రాథమిక పాఠశాల సమీపంలో రూ.9 లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీకి యువనేత కృష్ణమూర్తి శంకుస్థాపన చేశారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు,కార్పొరేటర్ శీలం భారతి నాగ కుసుమ రాణి, శీలం బాబ్జీ, కార్పొరేటర్ ముచర్ల శైలజ, షేక్ సిలార్ దాదా తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ఎ కొండూరు, విశాలాంధ్ర: మండలంలోని రామచంద్రాపురంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన గణపవరపు వెంకటేశ్వర రావు. సురేష్‌లకు టీడీపీ మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, రోజా రాణి దంపతులు 50 కేజీల బియ్యం, నిత్యవసర సరుకుల కొనుగోలుకు రూ.10లు అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని,ఎచ పక్కా గృహాన్ని మంజూరు చేయాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఒంటేరు రామారావు మాజీ ఎంపీటీసీ శీను ఎం సాయి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర, అవనిగడ్డ: అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్ తోనే సాధ్యం అని శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం వేకనూరు పరిధిలోని తుంగలవారిపాలెం లో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను అందచేస్తూ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. పిల్లల భవిష్యత్ బాగుండాలంటే జగన్‌కే తిరిగి పట్టం కట్టాలన్నారు. ఎం.పి.పి తుంగల సుమతీ దేవి, జడ్.పి.టి.సి. చింతలపూడి లక్ష్మీనారాయణ, రేపల్లె శ్రీనివాసరావు , తుంగల వేణు గోపాల్, అన్నపరెడ్డి రామదాసు, సింహాద్రి వెంకటేశ్వరరావు, వర్రె నరేష్, షేక్ నజీర్ భాష, గాజుల జయగోపాల్, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు గోదా కల్యాణం

విశాలాంధ్ర, అవనిగడ్డ: గీతామందిరంలో ఈ నెల 14న గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఎర్రంశెట్టి శ్రీహరి బాబు గురువారం తెలిపారు. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు స్వామి వార్లకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వేకువజామునుంచే విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామని చెప్పారు. దీనిని పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి సారె సమర్పించే కార్యక్రమం జరుగుతుందన్నారు.

మైక్రో చిత్రాలతోనే గుర్తింపు

విశాలాంధ్ర, మచిలీపట్నం: మైక్రో బొమ్మలను చిత్రీకరించడం తనకు ఆనందాన్నిస్తుందని గేదెల అప్పారావు అన్నారు. స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం లో ఆయన మాట్లాడారు. తాను మైక్రో చిత్రాలు మొదలుపెట్టి 50 సంవత్సరాలు పూర్తయిందని, 25వ సంవత్సరంలో సాలార్జంగ్ మ్యూజియంలో వేడుక జరుపుకోవడం జరిగిందన్నారు. మైక్రో చిత్రీకరణ తన మనవడు కూడా నేర్చుకున్నారని ఆయన తెలిపారు. వెంకటేశ్వర స్వామి 53 చిత్రాలతో మొదలుకొని స్వామి వివాహం వరకు మైక్రో బొమ్మలను తాను చిత్రీకరించడం జరిగిందన్నారు. అందువల్లే తనకు గుర్తింపు వచ్చిందని ఆయన వివరించారు.

కూచిపూడి ఎస్సైగా సందీప్

విశాలాంధ్ర, కూచిపూడి: పామర్రు సర్కిల్ పరిధిలోని కూచిపూడి పోలీస్ స్టేషన్ ఎస్సైగా డి సందీప్‌ను నియమిస్తూ కృష్ణాజిల్లా ఎస్పీ జాషువా ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 4న బదిలీ అయిన కూచిపూడి ఎస్సై కే. దుర్గాప్రసాదరావు స్థానంలో సందీప్ ను నియమించారని ఏ.ఎస్సై ఎస్ కే జిలాని గురువారం విలేకరులకు జరిపారు. జిల్లాలో ఏడుగురు ఎస్‌ఐలను బదిలీ చేశారు.

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - చల్లపల్లి: చల్లపల్లి రాజా కళాశాలలో 1999- 2001లో ఇంటర్మీడియట్ చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం సందడిగా జరిగింది. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న పూర్వవిద్యార్థులు తరలివచ్చి తాము చదువుకున్న కళాశాలలో గత స్మృతులను నెమరువేసుకున్నారు. విద్యనేర్పిన నాటి గురువులు ఎస్. రామారావు, టి.సాంబశివరావు, ప్రిన్సిపాల్ ఎస్ వి.నరసింహారావు, కార్యాలయ సిబ్బంది అన్నే లీలావతి, దాసరి రాఘవయ్యలను సన్మానించుకున్నారు. పూర్వ విద్యార్థులు పాగోలు దుర్గాప్రసాద్, లంకా సుబ్రహ్మణ్యం, వేముల లక్ష్మీనారాయణ, శోభిల లింగాధరరావు, బి.రత్నకుమారి, ఎం.సుమలత, ఎస్.పూర్ణిమ, స్వరాజ్యలక్ష్మి పర్యవేక్షించారు.

పని సర్దుబాటుకు ఉపాధ్యాయుల కేటాయింపు

విశాలాంధ్ర, కూచిపూడి: మొవ్వ మండలంలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు పని సర్దుబాటుపై వివిధ పాఠశాలలకు కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారిణి తహేరా సుల్తానా కేటాయించడంతో గురువారం ఆయా పాఠశాలలో చేరారు. దీనిలో భాగంగా మొవ్వ హైస్కూల్లో పనిచేస్తున్న లెక్కల టీచర్ కే. ప్రభాకర్ రావు కూచిపూడి శ్రీ జితేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హై స్కూల్ కి కేటాయించడంతో ప్రధాన ఉపాధ్యాయురాలు అన్నే లక్ష్మీ కుమారి ఆదేశాలతో ఉపాధ్యాయిని ఎమ్.ఎల్. మంజూష జాయిన్ పత్రం తీసుకున్నారు. ఈమెతో పాటు సిఆర్పి తాతా సమర్పణలు, ఉపాధ్యాయుడు బందారు మాణిక్యాలరావులు పాల్గొన్నారు. నిడుమోలు లెక్కలు మాస్టారు పివీ శేష సాయి చినముత్తేవి హై స్కూల్ కు, మంత్రి పాలెం ఎంపియుపి పాఠశాల సాంఘిక శాస్త్ర టీచర్ ఘంటసాల మండలం గోగినేనిపాలెం హై స్కూల్ కు, నిడుమోలుహై స్కూల్ ఇంగ్లీష్ టీచర్ ఎల్ రామచంద్రరావు కోసూరు హై స్కూల్ కి కేటాయించారు.

రేపు సిలికానాంధ్ర సంజీవినిలో ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర, కూచిపూడి: స్థానిక రవి ప్రకాష్ సిలికానంధ్ర సంజీవిని వైద్యాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 14 న 15 సంవత్సరాలు పైబడిన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. వైద్యాలయం, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తాయని చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. వైద్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొంటూ ముగ్గులు, రంగులు ఎవరికి వారే తెచ్చుకోవాలని సూచించారు.

కోడి పందేలకు బరులు సిద్ధం

విశాలాంధ్ర, కూచిపూడి: మొవ్వ మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వాహకులు కోడిపందేలకు బరులు సిద్ధం చేయడంలో తలమునకలై ఉన్నారు. జి .సి .కె. రోడ్డులో యద్దనపూడి, అయ్యంకిపంచాయతీల పరిధిలో ప్రధాన రహదారికి సమీపంలో జెసిపి సహాయంతోబరుల సిద్ధం చేస్తున్నారు. గత వారం రోజులుగా పోలీసు ఉన్నత అధికారులు సైతం కోడిపందేలపై ఉక్కుపాదం మోపుతామంటూ ప్రకటనలు చేస్తూ కోడి కత్తుల రాయుళ్లని అదుపులోకి తీసుకోవడం, బరులు ధ్వంసం చేయడం జరుగుతూనే ఉంది. దీనికి తోడు అధికార పార్టీ రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులు సైతం కోడిపందాలు నిర్వహించే సన్నివేశాలు ప్రసార మాధ్యమాలలో ప్రసారం కావడంతో నిర్వాహకులు సైతం ఆనందోత్సాహాలలో ఉన్నారు.

పీఏసీఎస్ భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర, పమిడిముక్కల: ఆయనపూడి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనానికి జడ్పిటిసి ఏనుగు వెంకటరమణకుమారి గురువారం శంకుస్థాపన చేశారు. రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. వెంకరమణ కుమారి మాట్లాడుతూ సీఎం జగన్ రైతులకు సబ్సిడీపై విత్తనాలు రుణాలు ఎరువులు ఇస్తున్నారని తెలిపారు. సర్పంచ్ ఏనుగు బేబీ వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ గంజాల సీతారామయ్య రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ కంభం రాంబాబు వైసిపి నాయకులు యేనుగ వెంకటేశ్వరరావు టి రాజేంద్ర ప్రసాద్ కొల్లి వెంకటప్రసాద్ తిరుమల శెట్టి బోసు బాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రగతిశీల భావజాలమే కవిరాజు కవిత్వం

జయంతి సభలో వక్తలు



విశాలాంధ్ర, గుడ్లవల్లేరు : సమాజంలో వేళ్ళూనుకున్న ఛాందస భావాలకు వ్యతిరేకంగా ప్రగతిశీల భావజాలంతో కవిరాజు త్రిపుర్నేని రామ స్వామి చౌదరి సామాజిక స్ఫూర్తి కలిగించారని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కవిరాజు రచనలు. సమాజం పై ప్రభావం అనే అంశం పై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కెంగార మాట్లాడుతూ గుడ్డి నమ్మకాలకు వ్యతిరేకంగానూ, సత్యాన్వేషణకు అనుకూలంగానూ సామాజిక ఉద్యమాన్ని నడిపిన ధీరోదాత్తుడిగా కవిరాజు కీర్తి పొందారని చెప్పారు. విద్యా ఓ వర్గానికే పరిమితం కాదనీ బ్రాహ్మణాధిపత్యం చెల్లదని అట్టడుగు వర్గాల పక్షాన నిలచి వారిలో చైతన్యాన్ని కలిగించిన మహా వ్యక్తిగా రామస్వామి చౌదరి పోరాటం జరిపారని మోహన్ అన్నారు. మండల సాహితీ స్రవంతి అధ్యక్షులు తలశిల నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ఇంజనీరింగ్ కళాశాల ఆ చార్యులు డాక్టర్ నర్ని శివ చింతయ్య ఇంజనీరింగ్ కళాశాల కార్యాలయ సుపరింటెండెంట్ గద్దె సోమరాజు తదితరులు ప్రసంగించారు. తొలుత కార్యనిర్వహణాధికారి ఎ.జె.ఎల్.నరసింహారావు కవి రాజు చిత్ర పటానికి పూల మాల వేశారు. గ్రంధాలయ అధికారిణి వాణి వందన సమర్పణ చేశారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర, గుడ్లవల్లేరు : మండలంలోని వివిధ గ్రామాలలో సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్.ఐ. వలదాసి ఏసోబు అన్నారు. గుడ్లవల్లేరు గ్రామ ఒకటవ సచివాలయంలో ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడిపందాల నిర్వహణ చట్ట విరుద్దమనీ ఇందుకు వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించినా చట్టపరంగా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో తహాశీల్దార్ అబ్దుల్ రెహమాన్, ఎమ్.పి.డి.ఓ. దారపు శ్రీనివాస్, పంచాయతీ కార్యాలయాల కార్య నిర్వహణాధికారి ఎ.జె.ఎల్. నరశింహారావు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో అవకాశాలు మెండు

విశాలాంధ్ర, పెనమలూరు: విద్యార్థి లోకం అందిపుచ్చుకోవాలి కానీ సివిల్ ఇంజనీరింగ్లో అవకాశాలు మెండుగా ఉన్నాయని యువత కొరత ఎక్కువగా ఉందని కాలిఫోర్నియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మణిదీప్ అన్నారు. కానూరు పివిపి సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల నందు నేషనల్ యూత్ డే సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్ విభాగము ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో వన్డే వర్క్ షాప్ ను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ మణిదీప్ మాట్లాడుతూ విజ్ఞానం కలిగిన యువత కొరత సివిల్ ఇంజనీరింగ్ లో ఉందన్నారు. అమెరికా లాంటి దేశాల్లో సివిల్ ఇంజనీరింగ్ నిపుణుల కొరత ఉందన్నారు. నైపుణ్యం మిమ్ములను విజయతీరాలకు చేరుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మరో ముఖ్య అతిథి గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ సునీల్ మాట్లాడుతూ డ్రోన్ విజ్ఞానాన్ని సివిల్ ఇంజనీరింగ్ రంగంలో ఏ విధంగా ఉపయోగిస్తారు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే శివాజీ బాబు, ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ జగదీష్, సివిల్ ఇంజనీరింగ్ అధిపతి కే రమేష్ వక్తలను సత్కరించారు.

భూహక్కు పట్టాల పంపిణీ

విశాలాంధ్ర, పెదపారుపూడి: రైతులు తమ, తమ పొలాలలోని సరిహద్దు విషయమై ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వ ఖర్చుతో హద్దులు ఏర్పాటు చేసి పక్కా పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు అందజేస్తున్న విధానం హర్షించదగ్గ విషయమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. ఈ విషయమై మండలంలోని జమీదింటకుర్రు గ్రామంలో సర్పంచ్ పునుకొల్లు శివరాం ప్రసాద్ అధ్యక్షతన చెరువు సెంటర్లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గురువారం రైతుల కోసం పూర్తిస్థాయిలో పొలం రి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అధికారులు అందించారు. అనంతరం అంగనవాడి భవన నిర్మాణానికి రూ.16.5 లక్షలు నిధులు హెచ్చించి భూమి పూజ చేశారు. భూషణగుళ్ళలో తాగునీటికి ఇబ్బంది కలగకుండా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ సొంత నిధులతో బోరు పంపును నిర్మించి ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. తదుపరి జెమిదింటకుర్రు, కొర్నిపాడు గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం లో భాగంగా ఇంటి, ఇంటికి వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి. నాగభూషణం, రీ సర్వే డిటి డి. సుందర్ రావు, వైసీపీ సీనియర్ నాయకులు గోళ్ళ సోమేశ్వరరావు, గ్రామ సర్పంచ్ పునుకొల్లు శివరాం, వానపాముల సర్పంచ్ పాతూరి రమేష్, వెంట్రప్రగడ సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, కొర్నిపాడు సర్పంచ్ దూడల లోకేశ్వరి, జడ్పిటిసి మాజీ సభ్యురాలు మూల్పూరి హరీష, తదితరులు పాల్గొన్నారు.

పల్లోటి స్కూలు ఔదార్యం

విశాలాంధ్ర, పెడన : నిరంతర సేవా కార్యక్రమాలలో భాగంగా స్నేహ సంస్థలోని అంధుల అవసరాల నిమిత్తం పల్లోటి స్కూలు విద్యార్థులు, ఉపాధ్యా యులు ఔదార్యం చూపారు. మొత్తం రూ.2 లక్షల స్నేహ సొసైటీ ఫర్ బ్లైండ్ విజయవాడకు నగదు అందజేశారు. స్కూలు కరస్పాండెంట్ ఫాదర్ బాల జోజి రెడ్డిమాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతి ,సామాజిక సేవా కార్యక్రమాలు చేయటలో పల్లోటి స్కూలు నిత్యం ముందు ఉంటుందని తెలిపారు.

ఖాతాదారుల సేవా కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - చల్లపల్లి: స్థానిక పొట్టిశ్రీరాములు వీధిలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎస్బీఐ ఖాతాదారుల సేవాకేంద్రాన్ని చల్లపల్లి శ్రీఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అన్నవరపు పాండురంగారావు ప్రారంభించారు. ఈ కార్యకరమంలో మచిలీపట్నం ఆర్బీవో ఫైనాన్స్ ఇన్ క్లూజన్ మేనేజర్ కిషోర్ నాయక్, వేదవాగ్ సిస్టమ్స్ డీఎం యుగంధర్, చల్లపల్లి ఎస్ బిఐ మేనేజర్ కె. ఆనందకుమార్, నిర్వాహకులు సిహెచ్.శంకర్, ఖాతాదారులు, దుకాణదారులు పాల్గొన్నారు. ఎస్బిఐ ఖాతాదారుల సేవాకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ, భవిష్యత్తులో బీసీ పాయింట్ ద్వారా మరిన్ని సేవలు అందించనున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

విశాలాంధ్ర, పమిడిముక్కల: వీరంకిలాకు నుండి ఉయ్యూరు కెసిపికి చెరుకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ రెడ్డిపాలెం కు చెందిన సిహెచ్ మణికంఠను గురువారం ఢీకొనడంతో అతడు అక్కడక్కడే మృతి చెందాడని ఎస్.ఐ.సత్యనారాయణ తెలిపారు. రెడ్డి పాలెం కి చెందిన చిరపు మణికంఠ (30) భోజనానికి వెళుతూ ముందు వెళ్తుతున్న ట్రాక్టర్ ను ఓవర్ టేక్ చేస్తుండగా ప్రమాదం జరిగి మృతి చెందాడని చెప్పారు. మృతు నకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

బెరాకా మినిస్ట్రీస్ సేవలు అమోఘం

విశాలాంధ్ర, మచిలీపట్నం: సాయం చేయాలన్న సంకల్పంతో ఆపన్నహస్తాన్ని అందించడం బెరాకా మినిస్ట్రీస్ నిర్వాహకులు కిరణ్‌పాల్ వంటి వ్యక్తులు వల్లనే అవుతుందని కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ప్రశంసించారు. కలెక్టర్ ఛాంబర్‌లో బెరాకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఉన్నత చదువులు, వైద్యం, క్రీడలకు రూ.4 లక్షలు, ల్యాప్‌టాప్ ను కలెక్టర్ అందజేశారు. కిరణ్ పాల్ దైవ సేవకుడికే కాకుండా పేద వర్గాలను అక్కున చేర్చుకుని సాయం చేయడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. సంఘ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగిరెడ్డి డానియల్, సూరత్ ప్రసాద్ వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ తదితరులు పాల్గొన్నారు.

పవనాగ్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర, మచిలీపట్నం: అతి చిన్న వయసులోనే చార్టర్డ్ అకౌంట్ పూర్తిచేసి 2022-23 అగ్రస్థానంలో నిలిచిన బందరుకు చెందిన ఉదయగిరి పవనాగ్ (21)ను గురువారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్, చాలా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మెడికల్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఉదయగిరి సురేష్ కుమారుడు పవనాగ్ చిన్న వయసులోనే చార్టర్డ్ అకౌంట్ పూర్తి చేసి నేటి యువతకు ఆదర్శప్రాయంగా నిలిచాడు అని న్యాయవాది లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ కన్వీనర్ లంకిశెట్టి బాలాజీ అన్నారు. ఏకకాలంలో చార్టర్డ్ అకౌంట్, బీకాం, సీ.ఎం.ఎ. డిగ్రీలు పొంది తన ప్రతిభ కనబరిచిన పవనాగ్ రాబోయే రోజుల్లో మరింత ఎదగాలని అన్నారు. దేశ వ్యాప్తంగా 150,000 మంది సీఏ ఫైనల్‌కు హాజరుగా 12,500 మాత్రమే అర్హత పొందారని, మచిలీపట్నం నుండి పవనాగ్ ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ, మచిలీపట్నం కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఉదయగిరి సురేష్ మాదిరెడ్డి అంజిబాబు, మదర్ థెరిసా సేవాసమితి అధ్యక్షుడు పైడిపాముల గురు ప్రసాద్, జనసేన పట్టణ అధ్యక్షులు గద్దం రాజు , తదితరులు పవనాగ్‌ను సన్మానించిన వారిలో ఉన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి



విశాలాంధ్ర, అవనిగడ్డ : మండలంలో వివేకానంద జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఉభాసభాపతి మండలి బుద్ధప్రసాద్ తన కార్యాలయంలో వివేకానందుని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఘంటశాల రాజమోహన్ రావు, అడపా శ్రీనివాసరావు, చెన్ను గాంధీ , లుక్క శ్రీను, మెగావత్తు గోపి, బచ్చు రఘునాథ్, రేపల్లె అంకినీడు, బర్మాశీను, సాయి నరహరి పాల్గొన్నారు. జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో వివేకనందుని జయంతిని పురస్కరించుకుని, భారతీయ జీవిత భీమ నేషనల్ ఆర్డినేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ సహాయ సహకారంతో విద్యార్థిని విద్యార్థులకు వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. తొలుత వివేకానంద చిత్రపటానికి తుంగల వెంకట గిరి, ఉపాధ్యాయులు కృష్ణ మోహన్‌లు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జీవిత భీమా సంస్థ అడ్మినిస్ట్రేట్ అధికారి పి. లక్ష్మీనారాయణ, స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ ప్రతినిధి అద్దంకి సాంబ శివరావు క్రికెట్ కిట్, వాలీబాల్స్, క్రికెట్ బాల్స్, సి.కె నాయుడు మెమోంటోలను అందచేశారు. జీవిత బీమా సంస్థ ఏజెంట్స్, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రి కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్.డి ఉమారాణి సూచన మేరకు జాతీయ సేవా పథకం ప్రోగాం అధికారిని వీర కుమారి ఆధ్వర్యంలో వివేకానందుడి జయంతి నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అంకరావు, రెడ్‌క్రాస్ సొసైటీ అవనిగడ్డ బ్రాంచ్ చైర్మన్ వంగర శేషగిరి రావు తదితరులు వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళుర్పించారు. జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా ఎన్.ఎస్.ఎస్., రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రథమ చికిత్సపై ఒక రోజు కార్యశాల నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైడీ లైఫ్ మెంబర్ సింహాద్రి రామ లింగేశ్వరరావు , అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గుడివాడలో...



విశాలాంధ్ర - గుడివాడ: పట్టణంలో స్వామి వివేకానంద 160 జయంతి సందర్భంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ, పట్టణ బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక నెహ్రూ చౌక్ సెంటర్లో స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా అయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బిజెపి పట్టణ అధ్యక్షుడు అంగడాల సతీష్, టంగుటూరి శ్రీనివాసరావు, గుంటూరు మల్లికార్జునరావు, ఆత్మకూరు శ్రీనివాసరావు, కొయ్యన శ్రీనివాసరావు, వినయ్‌కుమార్‌శర్మ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి బాటలో నడుద్దాం

విశాలాంధ్ర-కోడూరు : మండల పరిధిలోని కోడూరు ప్రధాన సెంటరు నందు మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్వామి వివేకనంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.తొలిత ఆయన చిత్రపటాని ఏర్పాటు చేసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షులు మర్రే గంగయ్య మాట్లాడుతూ స్వామి వివేకనంద జీవితం యువతకు ఆధర్శప్రాయం ఆయన బాటలోనే యువత నడవాలి అని అన్నారు. యర్రంశెట్టి దామోదరరావు, బావిశెట్టి ప్రభాకరరావు,జరుగు ఆదినారాయణ, కోట రాంబాబు,ఉల్లి ప్రహాద్,దాసరి వెంకట కృష్ణారావు,పూషడపు శ్రీనివాసరావు,బాసు శివ ప్రసాద్,మేడా పిచ్చియ్య,బడే రాజశేఖర్, ఆలుమూడి సురేష,తిరుపతి నవీన్,జనసైనుకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం...

విశాలాంధ్ర, పెడన : జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల ప్రెసిడెంట్ వీరంకి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. కృష్ణా జిల్లా అధ్యక్షులు కుక్కల వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పామర్తి వెంకటేశ్వరావు (ముసిలి) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పట్టణ నూతన యువజన విభాగం పట్టణ అధ్యక్షులు సౌతాని శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా గుడిమెట్ల అయ్యప్ప, సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జున్ను వెంకట అనిల్ నియామక పత్రాలు అందించారు. బొల్లా అమ్మన్న సేవా సంఘం (బి ఏ యస్ యస్) వితరణతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న పేద విద్యార్థి బసవతేజ దుర్గకి పుస్తకాలు ఉచితంగా అందించారు. బొల్లా అమ్మన్న సేవా సంఘం అధ్యక్షుడు హైదరాబాద్ హైకోర్టు అడ్వకేట్ బొల్లా పాపారావు, కార్యదర్శి బి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి జెవి అనిల్, కోశాధికారి మహమ్మద్ రహమాన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు...చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర - చల్లపల్లి: కోడిపందేలు నిర్వహించటం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశానుసారం కోడిపందేలు జరగకుండా చూసేందుకు మండల స్థాయిలో, గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో కోడిపందేల నిషేధానికి సంబంధించిన పోస్టర్ లను ఆవిష్కరించారు. టీంలో తనతో పాటు ఎంపీడీవో, ఎస్ఐ, పశుసంరక్షణ అధికారులుసభ్యులుగా ఉంటారనీ, కోడి పందేలు నిర్వహించినా, పాల్గొన్నా క్రిమినల్ చర్యలు తీసుకోవటం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈవోఆర్డీ బి. అశోక్ కుమార్, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.మనోజ్, డాక్టర్ వి. వినోద్ కుమార్, హెచ్చీలు పాండురంగారావు, టీడీ కుమార్, కృష్ణమోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

వివేకానందుడి భోదనలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : స్వామి వివేకానంద భోదనలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు స్ఫూర్తిగా, మార్గనిర్దేశకునిగా నిలిచిన స్వామి వివేకానంద జయంతిని ప్రతి ఏడూ జనవరి 12వ తేదీన యువజనోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. భారతదేశ ఖ్యాతిని, సాంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని అన్నారు. ఈ సందర్భంగా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ బహుమతులను అందజేశారు. జేసీ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా యువజన సర్వీసుల శాఖాధికారి యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టు కే రన్

విశాలాంధ్ర విజయవాడ కల్చరల్ : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ యువజనోత్సవాలలో భాగంగా డిజెవైఎమ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం బి ఆర్ టి ఎస్ రోడ్ లో టు కె రన్ జరిగింది. శారదా కళాశాల నుంచి ఫుడ్ జంక్షన్ వరకు ఈ కార్యక్రమం జరిగింది. టు కె రన్ లో ప్రధమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన వారికి నగదు బహుమతిని,మెడల్ అందించి అభినందించారు. మహిళా విజేతలను ప్రత్యేకంగా సత్కరించారు. రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులు బాజీ,ఎన్టీఆర్ జిల్లా బిజెవైఎమ్ అధ్యక్షుడు రవ్వ హరీష్,కార్యదర్శి సృజన,జిల్లా కార్యాలయ కార్యదర్శి కదం శ్రీను, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి,సత్యనారాయణపురం అధ్యక్షుడు బాచిమంచి రవికుమార్,రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పాలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వివేకానందుడికి నివాళి

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: స్వామీ వివేకానంద జయంతిని స్థానిక వివేకానందుని విగ్రహం వద్ద గురువారం పలు సంఘాలు నిర్వహించాయి. స్థానిక బీజేపీ నాయకులు ముందుగా వివేకానందునికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సూక్తులను నేటి యువత ఆదర్శవంతంగా తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పులపాక బాబు, లాము కొండలరావు, పెనుగొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

28వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రాన్ని వీరులపాడు లోని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారం 28వ రోజుకు చేరాయి. దీక్షలో సోంబత్తిన వెంకటేశ్వర్లు,సుంకర నరసింహారావు,వాసిరెడ్డి నాగేశ్వరరావు,కుమ్మరి రాములు, వాసిరెడ్డి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం తరలింపు నిర్ణయం ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు తమ నిరసనను రోజు రోజుకి ఉధృతం చేస్తామని తెలిపారు.

కిడ్నీ బాధితులకు అండగా ఉంటాం

విశాలాంధ్ర, ఎ కొండూరు: మండలం లోని ప్రాధమిక వైద్య శాలలో ఏర్పాటు చేయనున్న డయాలసిస్ కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే కొక్కిలి గడ్డ రక్షణ నిధి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్ల తో ఎమ్మెల్యే మాట్లాడుతూ కిడ్నీ డయాలిసిస్ బాదితులు కు జగన్ ప్రభుత్వం అండగ ఉందని అన్నారు ఈ మండలానికి కృష్ణా శుద్ధ జలల ను త్రాగు నీరు గ అందే విధంగా ప్రతి గ్రామం లో సింటెక్స్ ట్యాంక్ లును ఏర్పాటు చేసి ట్రాక్టర్ ట్యాంకర్ లు ద్వారా శుద్ధ కృష్ణా జలాలను అంద చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లోనే కిడ్నీ బాదితులు అందరికీ ఉచితం గ మందులు అంద చేస్తున్న ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. విజయవాడ నుజీవీడు ప్రాంతాలకు వెళుతున్న డయాలసిస్ బాధితులకు ఉచితంగ అంబులెన్స్ ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు . రూ 38కోట్ల నిధులు తో జల జీవన్ మిషన్ ద్వారా మండలం లో ఉన్న ప్రతి ఇంటికి శుద్ధ కృష్ణా జలాలను అందేచడమే లక్ష్యం అన్నారు. ఎ కొండూరు సర్పంచ్ వెంపటి రజనీ ఎంపీపీ కలసాని నాగలక్ష్మి చెన్నరావు కభంపాడు ఎంపీటీసీ కోట పుల్ల రావు వైసిపి సీనియర్ నాయకులు సోల నరసింహా రావు తహసిల్దార్ సిహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో నిత్యావసరాల చోరీ

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: మండలంలోని కొండపర్వలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ గురుకుల బాలికల పాఠశాలలో నిత్యావసరాలను సిబ్బందే గల్లంతు చేస్తున్న వైనం విచారణలో వెలుగుచూసింది. ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్న వంట, ఇతరత్రా పనులు చేసే సిబ్బంది గత కొంతకాలంగా ఇక్కడ విద్యార్థుల ఆహార అవసరాలకు వినియోగించాల్సిన సరకులను గల్లంతు చేస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదులు అందటంతో ప్రిన్సిపల్ బీఎస్.స్వర్ణలత నిఘా ఏర్పాటు చేయగా, కొందరు సిబ్బంది నిత్యావసర సరకులైన బియ్యం, కూరగాయలు, పప్పులు తరలిస్తూ ఆమెకు పట్టుబడ్డారు. ఈ విషయమై ఆమెను విచారించగా, జరిగిన సంఘటన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా, ఇక్కడ జరుగుతున్న సరకుల చోరీ, అధికారులకు పట్టుబడిన విషయాలు బయటకు ఎలా పొక్కాయనే విషయమై ఉన్నతాధికారులు క్రిందిస్థాయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జరిగిన సంఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోకుంటా, ఉన్నతాధికారులు సమాచారం బయటకు పొక్కిన విషయమై ముందుగా విచారణ చేపట్టడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

రామలింగేశ్వరుని ఆలయంలో...

విశాలాంధ్ర-వీరులపాడు: పెద్దాపురం గ్రామంలో శ్రీ రామలింగేశ్వర దేవాలయం నందు బుధవారం రాత్రి దొంగతనం జరిగినది. వీరులపాడు మండల ఎస్సై సోమేశ్వర కథనం మేరకు బుధవారం రాత్రి శ్రీ రామలింగేశ్వర దేవాలయం నందు జరిగిన చోరీలో నాలుగు గ్రాముల మంగళసూత్రాలు, వెండి శఠగోపం, ఉద్ధరిణీ తదితరు వస్తువులు చోరీకి గురి అయ్యాయని, వాటి విలువ సుమారు 25 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. స్వీపర్ చెరుకూరి వెంకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు. నందిగామ రూరల్ సీఐ నాగేంద్ర కుమార్, క్లూస్ టీం ఘటన స్థలాన్ని పరిశీలించారు.

సీపీఐ సానుభూతిపరుడు చల్లా శ్రీను మృతి

విశాలాంధ్ర-విజయవాడ : సీపీఐ సానుభూతిపరుడు కనకదుర్గమ్మ వారధి ముఠా కార్మికుడు చల్లా శ్రీను బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, ముఠా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి.పి.నాగేశ్వరరావులు చలసాని నగర్‌లోని శ్రీను నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఠాకార్మికుడుగా పని చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘ అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. చలసాని నగర్‌లో పార్టీ సానుభూతిపరుడుగా సేవలందించారని గుర్తు చేసుకున్నారు. శ్రీను కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనుకు నివాళులర్పించిన వారిలో ముఠా మేస్త్రీ బలగాని శ్రీను, కోరె కొండలరావు, వేముల శ్రీను, బండారు బుజ్జి, సన్యాసప్పుడు, వేముల వాసు, తెల్లగడ్డ శ్రీను, గురవయ్య, రవీంద్రారెడ్డి, బి.నరేంద్ర ఉన్నారు. గురువారం చల్లా శ్రీను అంత్యక్రియలు జరిగాయి.

దళిత, గిరిజనుల అభివృద్ధికి కృషి చేసింది

కమ్యూనిస్టులు, క్రైస్తవ సంస్థలే

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ : తరతరాలుగా పేదరికంలో మగ్గుతున్న దళిత, గిరిజనుల అభివృద్ధికి కృషి చేసింది కమ్యూనిస్టులు, క్రైస్తవ సంస్థలే అని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. గుణదలలో డాక్టర్ బి.ఎబినేజరు షాజీ నేతృత్వంలో నిర్మించిన మెట్రోపాలిటన్ మిషన్ సెయింట్ జాన్స్ ఇవాంజిలికల్ చర్చి నూతన మందిర ప్రారంభోత్సవం గురువారం ప్రతిష్ఠాత్మకంగా జరిగింది. తొలుత ఎం.ఎం.జనరల్ కన్వెన్షన్స్ కార్యక్రమంలో జల్లి విల్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజనులు అంటరానితనానికి, నిరక్ష్యరాస్య తకు బలయ్యారని తెలిపారు. వారిలో ఉన్న మూఢనమ్మకాలని, నిరక్షరాస్యతను, అంటరా నితనాన్ని పొందోలి, శ్రమకు తగ్గ ఫలితం రాబట్టేందుకు వారిని చైతన్యపరిచింది, విద్యావైద్య సౌకర్యాలు కల్పించిన చరిత్ర క్రైస్తవ సంస్థలు, కమ్యూనిస్టులకే దక్కుతుందని చెప్పారు. ఈనాటికి అంటరానితనం, నిరక్ష్యరాస్యత, శ్రమకు తగిన ఫలాలకు దూరంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రైస్తవ మిషనరీలు మన దేశంలో విద్యా, వైద్య సంస్థలను నెలకొల్పి పేదలకు సేవలు అందించారని చెప్పారు. పేదల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించి వారు ఉన్నతంగా ఎదిగేందుకు దోహదం చేశారని తెలిపారు. తద్వారా అంటరాని వర్గాలకు ఆత్మవిశ్వాసం పెరిగిందనీ, సామాజిక గౌరవం లభించిం దన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలన వివక్షత కారణంగా దళితులు, గిరిజనులు, క్రైస్తవులు, ముస్లింలు అభద్రతా భావంతో భయం భయంగా జీవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరికి అండగా ఉండాల్సిన బాధ్యత లౌకికవాదులపైన ఉందని జల్లి విల్సన్ విజ్ఞప్తి చేశారు.

వైసీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినాష్ మాట్లాడుతూ, ఈ చర్చ్‌తో తమ కుటుంబానికి సత్సంబంధాలు ఉన్నాయన్నారు. క్రైస్తవల కోసం సుందరమైన చర్చి నిర్మించినందుకు హర్షం వ్యక్తం చేశారు. క్రైస్తవులకు, చర్చి పెద్దలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చి నిర్మించిన రెవరెండ్ డాక్టర్ బి.ఎబినేజరు షాజీకి క్రైస్తవ పీఠాధిపతులు 'బిషప్' బిరుదు ప్రధానం చేశారు. మెట్రోపాలిటన్ మిషన్ అధ్యక్షులు ఎన్.అబ్రహం, కార్యదర్శి విజయరత్నం, కోశాధికారి ఎం.ఏసుపాదం, చీఫ్ కన్సల్టెంట్ రెవరెండ్ సైమన్ సీజర్, సంఘ పెద్దలు టి.బోసు, పి.ప్రకాషరావు, ఎలీషా, శ్రీధర్, రాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. క్రైస్తవులు వేలాదిగా హాజరయ్యారు.

ఏడాదికి 12 వేల యూనిట్ల

రక్తం సేకరణే లక్ష్యం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్): ఏడాదికి 12 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించాలన్న లక్ష్యంతో జిల్లాలో మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని, రోగుల సౌకర్యార్థం నగరంలోని సూర్యారావు పేటలో రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్ కాప్ సేకరించిన రక్తాన్ని మాత్రమే రోగులకు వినియోగించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.55 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన సంచార వైద్య వాహనాన్ని గురువారం కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సేవలను రోగులకు చేరువ చేయాలన్నదే తన లక్ష్యం అన్నారు. జిల్లా వ్యాప్తంగా యూత్ రెడ్ క్లాస్ ను ప్రోత్సహించి ప్రతి కళాశాలలోనూ రక్తదాన శిబిరాలను నిర్వహించి ఏడాదికి సుమారు 12 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించనున్నామన్నారు. సేకరించిన రక్తంలో నెలకు 100 యూనిట్లను గిరిజనులకు అట్టడుగునున్న పేద వర్గాలకు ఉచితంగా అందిస్తామన్నారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులకు అవసమైన రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సేకరించిన రక్తాన్ని మాత్రమే వినియోగించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. యూత్ రెడ్ క్లాస్ టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలలో ప్రతి ఇంటిలోని సభ్యులకు హృద్రోగ లక్షణాలపై అవగాహన కల్పించి గుండెపోటును నివారించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ రాష్ట్ర సంస్థ 65 లక్షల రూపాయల వ్యయంతో సంచార వైద్య వాహనాన్ని కొనుగోలు చేసి జిల్లాకు అందచేయడం జరిగిందనన్నారు. సంచార వైద్య వాహనం ద్వారా వైద్య బృందం జిల్లాలో పర్యటించి రోగులకు వైద్య సేవలు అందించడం తో పాటు దాతల నుండి రక్తాన్ని సేకరించడం జరుగుతుందన్నారు. ప్రకృతి.. వైపరీత్యాలు విపత్కర పరిస్థితులు సంభవించినపుడు తక్షణమే స్పందించి సేవలందించడం తో పాటు క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం అందించడం ఉచిత కంటి దంత వైద్య శిబిరాలు నిర్వహణ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డా.జి. సమరం, జనరల్ సెక్రటరీ డా.బ్లల్లా రవి, మేనేజర్ సిహెచ్ శ్రీనివాసరావు,సూపర్ వైజర్ టి. సునీత రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో యువకుడి అరెస్టు

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: గత ఏడాది ఆగస్టులో విస్సన్నపేటలో ఒక యువకునిపై దాడి జరిగిన ఘటనపై ఒక యువకుడిని అరెస్టు చేసినట్లు తిరువూరు సీఐ ఆర్.బీమరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం విస్సన్నపేటకు చెందిన మేశపాం శరత్‌బాబు అనే యువకునిపై దాడి కేసులో ఇదే గ్రామానికి చెందిన పల్లిపాం శ్రీకాంత్ అనే నిందితుడిని విస్సన్నపేట ఎస్ఐ ఎం.కిశోర్‌బాబు అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

అందరికీ అందుబాటులో బ్యాంక్ సేవలు

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: బ్యాంకింగ్ సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు జిల్లా అధికారి సంతోష్ అన్నారు. విస్సన్నపేటలో ఏర్పాటు చేసిన నూతన శాఖను మాజీ సర్పంచి కుక్కడపు ప్రసాదరావు ప్రారంభించగా, ఇందుకు హాజరైన సంతోష్ కొద్దిసేపు మాట్లాడారు. ఇప్పటివరకు తమ బ్యాంకు 7100 శాఖలతో విజయవంతంగా నడుస్తోందని, విస్సన్నపేటలో తాజాగా 7101వ శాఖ ఆరంభించామని, మరో 300 శాఖలు ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. గ్రామీణప్రాంతాల్లో సేవలందించే దిశగా ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక క్లస్టర్ ఏజంట్‌ను నియమించనున్నామన్నారు. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే తమ బ్యాంకులో రూ.1,300కోట్ల డిపాజిట్లు ఉన్నాయని, వీటిని మరింత పెంచుతూ, మరోవైపు సామాన్యులకు సేవలందించేందుకు మరిన్ని సేవలందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆయనతోపాటు స్థానిక మేనేజర్ వీరబాబు, స్థానిక ప్రముఖులు గంధం సత్యశ్రీ హనుమంతరావు, అబ్బూరి శ్రీనివాసరావు, కాజా దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

కోడిపందేలకు బరులు సిద్ధం

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: మండలంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు గ్రామాల్లో కోడిపందాల నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే విస్సన్నపేట, కొండపర్వ, పుత్రేల, తెల్లదేవరపల్లి, కొర్లమండ, వేమిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వాహకులు పందాల బరులు ఏర్పాటు చేశారు. పండుగ సందర్భంగా సంప్రదాయబద్ధంగా జరిగే పందాలు నిరాటంకంగా కొనసాగుతాయని, పోలీసుశాఖ అనుమతులు ఇచ్చేసిందంటూ నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారు. మరోవైపు పందాల మాటున పెద్దఎత్తున జూదం నిర్వహించేందుకు పేకాటరాయుళ్లు తమ ఏర్పాట్లలో తాము నిమగ్నమై ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై తిరువూరు సీఐ ఆర్.భీమరాజును విచారించగా, తిరువూరు సర్కిల్ పరిధిలోని కోడిపందాల నిర్వహణకు అనుమతులు లేవని, ఇటువంటి ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని తెలిపారు. ఇప్పటికే కోడిపందాల నిర్వహణకు ఏర్పాటు చేసిన రెండు బరులు ధ్వంసం చేయటంతోపాటు, 282మంది పాత జూదరులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

'మిక్'లో నేషనల్ యూత్ డే

విశాలాంధ్ర- కంచికచర్ల: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని కంచికచర్ల మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ యూత్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కడివెండి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, యూత్ పార్లమెంటు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వివేకానంద బోధనలు విద్యార్థులకు, భావితరాలకు మంచి నడవడిక, ఉత్తేజం, దేశభక్తి, జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు తోడ్పడుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. సీఈవో డి. పాండు రంగారావు,ఎం. సుహాస్, డైరెక్టర్ డైరెక్టర్ అకాడమిక్స్ డాక్టర్ టి. వంశీ కిరణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-విజయవాడ(క్రైమ్): అనుమానాస్పదంగా పోలీస్ కానిస్టేబుల్ మృతి చెందారు. ఈ ఘటన విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జంగారెడ్డిగూడెంకు చెందిన ఇసకపాటి నవీన్ ప్రతాప్‌కుమార్(45) 6వ బెటాలియన్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గొల్లపూడిలో ఇంటిలిజన్స్ సెక్యూరిటీ వింగ్ కార్యాలయంలో విధులు నిర్వహించి తన గదిలో విశ్రాంతి తీసుకున్నారు. తోటి కానిస్టేబుల్ వెళ్లి చూసేసరికి నిద్రలోనే మరణించి ఉన్నాడు. గుండెపోటుతో చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు.

నేడు సీపీఐ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 58వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో అజిత్‌సింగ్‌నగర్ కృష్ణాహొటల్ సెంటర్ వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొంటారని పేర్కొన్నారు.

రీసర్వే పాస్ పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-తిరువూరు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం కింద జూన్ నెలలో జరిగిన రీసర్వే పట్టాదారు పాసుపుస్తకాలను తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి ప్రసన్న లక్ష్మీ పంపిణీ చేశారు. గురువారం మండలంలోని ఆంజనేయపురం గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్ సురేష్ బాబుతో కలిసి రైతులకు వీటిని అందజేశారు. తిరువూరు మండలంలోని ముష్టికుంట్ల, వామకుంట్ల, చిట్టేల, ఆంజనేయపురం గ్రామాలకు 479 డిజిటల్ పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు కాగా, చిట్టేల, ఆంజనేయపురం గ్రామాల్లో పంపిణీ పూర్తి చేశామని, మిగిలిన గ్రామాల రైతులకు త్వరలో అందజేస్తామని తహశీల్దార్ తెలిపారు. మామిడి కుటుంబరావు, ముక్కామల సీతారామయ్య, వీఆర్వో గోపాలకృష్ణ రైతులు పాల్గొన్నారు.

వివేకానందుడికి నివాళి

విశాలాంధ్ర-తిరువూరు: రామకృష్ణ మిషన్ వ్యవస్థాపకుడు స్వామి వివేకానంద జయంతి స్థానిక శ్రీనిధి టెక్నో స్కూల్లో గురువారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఆర్ వెంకట నారాయణ, విద్యార్థులు వివేకానందుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వివేకానందుని బోధనలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి రవి, ఎం సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ రాష్ట్రానికి



విశాలాంధ్ర, గన్నవరం: ఉంగుటూరు మండలం ఆముదలపల్లి గ్రామం లో గురువారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం జరిగింది మండల అధ్యక్షులు డాక్టర్ అరుమాళ్ళ వెంకట కృష్ణా రెడ్డి అధ్యక్షతన గ్రామ పార్టీ అధ్యక్షులు కొట్టిం మధ్యరామయ్య (వాసు)సెక్రటరీ దాసరి వెంకట రంగారావు ఉప అధ్యక్షులు జయరాజు గుప్తా అనిల్ సుబ్బారావు సత్యానారాయణ వెంకటేశ్వరరావు జోజి గ్రామం కమిటీ సభ్యులు పాల్గొన్నారు

ఫిబ్రవరి 5 నుంచి తిరుపతమ్మ తిరునాళ్లు



విశాలాంధ్ర, పెనుగంచిప్రోలు: తి రు ప త మ్మ అమ్మవారిపె ద్ద తిరునాళ్ల ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జరగనుంది. తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవం సందర్బంగా వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఏర్పాట్లుపై సమీక్షా సమావేశం ను నందిగామ ఆర్డీఓ రవీంద్ర రా వు అధ్యక్షన గురువారం నిర్వహించారు. నందిగామ ఆర్డీవో ఏ . రవీంద్రరావు, ఆలయ ఈ ఓ వీ.డిఎన్. లీలా కుమార్ , దేవాలయ పాలక మండలి కమిటీ ఛైర్మెన్ చెన్నకేశవ రావు , తహశీల్దార్ లక్ష్మి కళ్యాణి , ఎంపీడీవో ప్రసాద్ , జగ్గయ్యపేట సిఐ నాగ మురళి రెవెన్యూ డిపార్ట్మెంట్ , పంచాయతీ డిపార్ట్మెంట్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారు, ఏపీఎస్ఆర్టీసీ.టిఎస్ఆర్టిసి వారు, అగ్ని మాపక శాఖ, మెడికల్ డిపార్ట్మెంట్ , పోలీస్ డిపార్ట్మెంట్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంగీత సద్గురువు త్యాగరాజస్వామి

విశాలాంధ్ర, విజయవాడ కల్చరల్ : పుష్య బహుళ పంచమి నాడు సిద్ధి పొందిన సంగీత త్రిమూర్తులలో ఒకరైన సంగీత సద్గురువు త్యాగరాజ స్వామిని స్మరించుకుంటూ ప్రతి కర్ణాటక సంగీత విద్వాంసులు,వర్ధమానులు, అభ్యాసకులు అత్యంత భక్తి ప్రపత్తులతో ఆరాధనోత్సవాలు జరుపుకుంటారు. ఆ క్రమంలోనే గుణదల గంగిరెద్దుల దిబ్బలోని నాయీ బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహం,సంగీత పాఠశాల సంక్షేమ సంఘం కమిటీ సభ్యుల,గుంటుపల్లి ఉమామహేశ్వరరావు ల సంయుక్త ఆధ్వర్యంలో సంబంధిత గృహ ప్రాంగణంలో గురువారం జరిగిన త్యాగరాజ ఆరాధనోత్సవం మంగళ వాయిద్యాలతో ప్రారంభమైంది. మహిళా మృదంగ విద్వాంసురాలు పద్మశ్రీ దండమూడి సుమతి రామమోహనరావు, ఉత్సవమును త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూలదండలు వేసి ప్రారంభించారు. ప్రముఖ గాత్ర సంగీత విద్వాంసులు కె.వి బ్రహ్మానందం,వేమూరి విశ్వనాథ్,లంక తేజస్వినిలు పంచరత్న కీర్తనలను గానం చేసి పలు త్యాగరాజ కీర్తనలను పాడి వినిపించారు. వీరికి వయోలిన్ తో అభిరామ్, మృదంగంతో ఎస్ అమ్ముల ప్రసాద్ లు సహకరించారు. విద్వాంసులను సుప్రసిద్ధ మృదంగ విద్వాంసురాలు పద్మశ్రీ దండమూడి సుమతీ రామమోహనరావు,ఒ ఎస్ డి టు ఆనర్ బుల్ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ చీఫ్ విప్ ఎం ప్రభాకర్ తదితరులుసత్కరించారు.

వసతి గృహాలను సందర్శిస్తుండాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : సంక్షేమ వసతి గృహాల నిర్వహణను అధికారులు తరచూ పర్యవేక్షిస్తుండాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. స్థానిక కస్తూరిబాయి పేటలోని సాంఘీక సంక్షేమ శాఖ బాలికల ప్రత్యేక వసతి గృహాన్ని బుధవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనఖీచేసి వసతి గృహంలో విద్యార్థులకు అఈందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఇటీవల 8వ తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల్లోని పాఠాంశ్యాలను, టెస్టు పుస్తకాల్లోని పాఠాంశ్యాలను సరి చూసి విద్యార్థుల నుంచి సమాదానాలను అడిగి తెలుసుకున్నారు. ఆడియో, వీడియో రూపంలో విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో డిజిటల్ రూపొందించిన పాఠాంశ్యాలు ఉపయోకకరంగా ఉన్నాయని కలెక్టర్‌కు ఈ సందర్భంగా విద్యార్థులు తెలిపారు. సౌకర్యాల కల్పనలో లోటు పాట్లు గుర్తిస్తే వార్డెన్‌లపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు.

గణతంత్ర వేడుకలను మోదీతో కలిసి వీక్షించడం అభినందనీయం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రధాన మంత్రితో కలిసి పెరెడ్‌ను తిలకించేందుకు ఢిల్లీ నుంచి ఆహ్వానం అందుకున్న డాక్టర్ బాణావతి తేజస్విని జిల్లా కల్టెకర్ ఎస్.డిల్లీరావు గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో అభినందించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ జోద్‌పూర్ ఎయిమ్స్‌లో జనరల్ మెడిసిన్‌లో మాస్టర్ డిగ్రీలో ఉత్తమ ప్రతిభ కనపర్చి మెడల్స్ అందుకున్న తేజస్వికి రాజదాని న్యూ ఢిల్లీలో అత్యంత వైభవంగా నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలను భారత ప్రధాని నరేంద్రమోడీతో కలిసి వీక్షించే అవకాశం రావడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర పన్నుల శాఖలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌గా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న బీ.వెంకటేశ్వరావు కుమార్తె డాక్టర్ తేజస్వి ప్రదాన మంత్రి బాక్సు నుంచి గణతంత్ర వేడుకలను వీక్షించేందుకు 50 మంది ప్రతిభావంతులైన విద్యార్దులను ఎంపిక చేస్తారని తెలిపారు. వీరిలో నగరంలోని గుణదల ఎన్టీఆర్ కాలనీకి చెందిన తేజస్విని ఎంపిక కావటం గర్వకారణమన్నారు. స్థానిక సిద్దార్థ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేసి అత్యంత ప్రతిభ కనపర్చి 6 గోల్డ్ మెడల్స్ అందుకున్నట్లు తెలిపారు. ఆలిండియా ఇన్స్టూట్యాట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో జనరల్ మెడిసిన్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తిచేసి బెస్ట్ అవుట్ గోయింగ్ విద్యార్థిగా గోల్డ్‌మెడల్ సాదించటం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. ఈ స్ణందర్భంగా కలెక్టర్ ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-వీరులపాడు:సంక్రాతి సంబరాలలో భాగంగా జమ్మవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ వాలీబాల్ పోటీలను నందిగామ రూరల్ సీఐ నాగేంద్ర కుమార్, ఎస్ఐ సోమేశ్వరరావు లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యాదాల సుజాత,జిల్లా సమాఖ్య సెక్రటరీ కర్ల రాణి, నాయకులు నల్లబోయిన తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర-నందిగామ: సంక్రాంతి పండుగ సందర్భంగా నందిగామ పోలీస్ వారి ఆధ్వర్యంలో నందిగామ పట్టణంలోని చందా పురం బైపాస్ లో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్ ను శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజలు సంక్రాంతి పండుగను ఎంతో వైభవంగా జరుపుకుంటారని తెలిపారు, అదేవిధంగా సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు,జూదం,గుండాటల వైపు యువత దృష్టి సారించి ఆర్థికంగా మానసికంగా నష్టపోతున్నారని, డబ్బులు పోగొట్టుకొని వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, అటువంటి వాటిని దూరంగా ఉండేందుకు నందిగామ పోలీస్ వారి ఆధ్వర్యంలో క్రికెట్, కబడ్డీ లాంటి టోర్నమెంట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.ఈ కార్యక్రమంలో నందిగామ డివిజన్ పోలీస్ అధికారులు, పలువురు క్రీడాకారులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సత్సంకల్పంతో చిన్నారుల, వయోవృద్ధుల నదీ సంక్రాంతి



విశాలాంధ్ర-విజయవాడ: వేకువనే వందలాది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, కృష్ణానదీ తీరాన కొండవీటివాగు ప్రాజెక్ట్ ఎదురు వనాలలోని చెత్త ఏరి, శుభ్రం చేసి మొక్కలు నాటారు. అవార స్విమ్మర్లు, ఈత శిక్షణ - ప్రాణ రక్షణ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు ఏర్పరిచిన రక్షణా వలయంలో ఈ చిన్నారులు ఉత్సాహంగా నదిలో కేరింతలు కొట్టి ఆనందించారు. నదీలో నిలువుగా ఈదుకుంటూ తిరిగివచ్చిన ఇటీవల శిక్షణ పొందిన వయోవృద్ధ స్విమ్మర్స్ యెర్నేని సీతాదేవి, వాసుదేవరావు, విశాల, మన్నం కృష్ణమూర్తిలను ఘనంగా కేరింతలతో స్వాగతం పలికారు. పిల్లలు యావన్నందీ మాకుమ్మదిగా పాడిన "మా తెలుగు తల్లి" పాటలతో నదీ ప్రాంగణం మారుమోగింది. శిక్షకురాలు శకుంతలాదేవి, ప్రాణరక్షక్ పంకజ్ సమన్వయ పరిచిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆసక్తి గలవారు 9494126812 లో నమోదు చేసుకొన వచ్చునని నిర్వాహకులు తెలిపారు.

CHANGE OF NAME

I, **VIJAYA PAIDIPALLI** (Old Name) W/o. **SARATH BABU YELAMANCHI**, resident of Plot No. 35, House No. 57-14-5, Road No.1A, New Postal Colony, Patamata, Vijayawada -520010, A.P. Have changed my Name from **VIJAYA PAIDIPALLI** (Old Name) to **VIJAYALAKSHMI PAIDIPALLI** (new name). Hereafter be called, Known as **VIJAYALAKSHMI PAIDIPALLI**.

CHANGE OF NAME

I, **RAHIMA KHATOON** spouse of Ex. No. 14468957F GNR Hafeez Khan resident of D No. 19-17-20C, JP Apartments Road, Old Rajarajeswari Peta, Vijayawada, Krishna Dist, A.P. - 520001 have changed my name from **RAHIMA KHATOON** (Old Name) to **RAHIMA KHATUN** (New Name) and my correct date of birth is 14 JAN 1968 vide affidavit dated 11/01/2023